క్లుప్తంగా

గిరిజన విజ్ఞాన పరిరక్షణ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ తదితరులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన సెమినార్‌లో వచ్చిన పరిశోధన పత్రాలతో రూపొందించిన పుస్తకాన్ని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ గురువారం ఆవిష్కరించారు. 'గిరిజన ప్రాచీన విజ్ఞాన పరిరక్షణ, భవిష్యత్తు తరాలకు చేర్చడం' అనే అంశంపై ఆగస్టు 21, 22లో జరిగిన సెమినార్‌లో 46 పరిశోధన పత్రాలతో పాటు కొన్ని ఆర్టికల్స్ వచ్చాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి మాట్లాడుతూ ఈ పుస్తకానికి అధ్యాపకులు డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ ఆర్ఎస్ వరహాలదొర, డాక్టర్ ఆర్ఎస్ సాంబశివరావు, డాక్టర్ ఎన్‌వీఎస్ సూర్యనారాయణ ఎడిటర్లుగా వ్యవహరించారన్నారు.

అదృష్టవంతులు సినిమా వేడుక

రంగంపేట: అక్కినేని శత జయంతి వారోత్సవాల సందర్భంగా ఆయన నటించిన అదృష్టవంతులు సినిమా 55 ఏళ్ల వేడుకను గురువారం దొడ్డిగుంటలోని బాల గణపతి ఆలయం వద్ద అక్కినేని అభిమాని అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మరిడయ్య మాట్లాడుతూ అదృష్టవంతులు సినిమా అప్పట్లో ఘన విజయం సాధించిందన్నారు. విక్టరీ మధుసూదనరావు దర్శకత్వంలో జగపతి ఆర్ట్స్ అధినేత వీబీ రాజేంద్రప్రసాద్ ఈ సినిమాను నిర్మించారన్నారు. ఈ సినిమాలోని పాటలన్నీ మంచి ప్రేక్షాదరణ పొందాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, పేపకాయల వెంకన్న, వెలమర్తి రమేష్ పాల్గొన్నారు.

దత్త పీఠంలో ప్రత్యేక అభిషేకాలు



ఔదంబర దత్త క్షేత్రంలో అభిషేకం చేస్తున్న భక్తులు

అనపర్తి: గ్రామంలోని ఔదంబర దత్తపీఠంలో కొలువైన దత్తాత్రేయుడికి గురువారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. గురుస్వామి మల్లిడి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో అర్చకుడు నరసింహమూర్తి అభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

26, 27 తేదీల్లో శిక్షణ

బిక్కవోలు: ఓన్ సోర్స్ రెవెన్యూపై మండలంలోని పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఈ నెల 26, 27 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఈ రెండు రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మాస్టర్ ట్రైనీలు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రంగంపేట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్, 33 కేవీ పవర్ గ్రిడ్ పరిధిలోని వినియోగదారులకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నటరాజన్ తెలిపారు. ఏడీబీ రోడ్డు విస్తరణ పనులలో భాగంగా విద్యుత్తు స్తంభాలు మార్చడం, లైన్లు వేయడం జరుగుతుందన్నారు. దీంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

దీన్ దయాళ్ ఉపాధ్యాయకు నివాళి



పందలపాకలో మొక్క నాటుతున్న నాయకులు

బిక్కవోలు: అంత్యోదయ సిద్ధాంతం ద్వారా చిట్ట చివరి వ్యక్తులకూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందించాలని సంకల్పించిన నాయకుడు జనసంఘ్ మాజీ జాతీయ అధ్యక్షుడు దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని బీజేపీ సీనియర్ నాయకుడు బొగాది వెంకట రమణ అన్నారు. మండలంలోని పందలపాక, ఊలపల్లి, బిక్కవోలు గ్రామాల్లో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి పూల మాలలు వేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలోని బీజేపీ మండల అధ్యక్షుడు మేడపాటి దుర్గారెడ్డి, పందలపాక సర్పంచ్ సబ్బారాపు పద్మావతి, ఉప సర్పంచ్ పడాల వెంకట రామారెడ్డి, బిక్కవోలు సర్పంచ్ సరెళ సుమలత, ఊలపల్లి ఎంపీటీసీ బండారు శివ పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- ఎన్ఎంఎంఎస్‌తో పేద విద్యార్థులకు బాసట
- ఉపకార వేతనాలు అందిస్తున్న కేంద్రం
- ఈ నెల 30 వరకూ దరఖాస్తులకు అవకాశం



కాపవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు

బిక్కవోలు: పాఠశాల విద్యలో ఏడు నుంచి పదో తరగతి ఎంతో కీలకం. పదో తరగతి పూర్తయిన తర్వాత ఇంటర్ కూడా ఎంతో ముఖ్యం. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపకారం వేతనాలను అందిస్తోంది. తద్వారా వారిలో ఉత్సాహం నింపుతోంది. ముఖ్యంగా ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఏటా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తోంది. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. దీనిలో సత్తా చాటిన వారికి 9 నుంచి 12వ తరగతి వరకూ ఏటా రూ.12 వేలు వంతున ఉపకారం వేతనాన్ని అందజేస్తోంది. ఈ ఏడాది ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఈ నెల 30 వరకూ మాత్రమే గడువు ఉంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.జోవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

అర్హతలు ఇవే

2025–26 విద్యా సంవత్సరంలో జిల్లా పరిషత్, మోడల్, ఎయిడెడ్, మున్సిపల్ తదితర ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలు ఉండాలి. ప్రస్తుతం 8వ తరగతి చదువుతూ ఏడో తరగతిలో జనరల్, బీసీ కులానికి చెందిన వారు 55 శాతం ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు సాధించాలి. జనరల్ బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 పరీక్ష ఫీజుగా చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

డిసెంబర్ 7న రాత పరీక్ష

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ కోసం రాష్ట వ్యాప్తంగా డిసెంబర్ ఏడున రాత పరీక్ష నిర్వహించనున్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో పరీక్ష ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని విభాగాల వారీగా అర్హుల జాబితాను తయారు చేస్తారు. ఇందులో పరీక్ష రెండు విభాగాలుగా ఉంటుంది. ఒకటి మెంటల్ ఎబిలిటీ (ఎంఏటీ), రెండోది ఆప్టిట్యూట్ టెస్ట్ (ఎస్ఏటీ). వీటిలో 6, 7, 8వ తరగతి పాఠ్యపుస్తకాల్లోని సైన్స్, గణితం, సామాజిక అధ్యయనాల విభాగాల్లో 90 మార్కులు, మెంటల్ ఎబిలిటీ, వెర్బల్, నాన్ వెర్బల్, రీజనింగ్ నుంచి 90 మార్కులు మొత్తం 180 మార్కులు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఇస్తారు. గతేడాది నియోజకవర్గంలోని అనపర్తి మండలంలో 16 మంది, బిక్కవోలు మండలంలో తొమ్మిది మంది, రంగంపేట మండలంలో ఆరుగురు, పెదపూడి మండలంలో ఐదుగురు కలిసి మొత్తం 36 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ అర్హత సాధించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో సుమారు 452 మంది విద్యార్థులు 8వ తరగతి చదువుతున్నారు.

ప్రతి రోజూ సాధన చేయాలి



పరీక్ష దగ్గర పడినప్పుడు కాకుండా, ముందు నుంచే ప్రతి రోజూ సాధన చేయాలి. దాదాపు రెండు గంటల సమయం కేటాయించాలి. ఆప్టిట్యూట్‌పై ఎక్కువగా దృష్టి పెట్టాలి. గతంతో నేను సాధించాను.

– జి.మహాలక్ష్మి, విద్యార్థిని, కాపవరం

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎక్కువ మంది ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎంపికైన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందుతుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– సీహెచ్ సత్యనారాయణ, ఎంఈఓ –1, బిక్కవోలు

ఫ్లెక్సీ ప్రమాదంపై ఎమ్మెల్యే స్పందన ఏదీ!

- బాధితురాలిని కనీసం పరామర్శించకపోవడం దారుణం
- మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: అనపర్తి కెనాల్ రోడ్డులో పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రచార ఫ్లెక్సీ పడి మహిళ తీవ్రంగా గాయపడిందని, ఈ ఘటనపై ఎమ్మెల్యే స్పందించకపోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఫ్లెక్సీ పడడంతో బిక్కవోలుకు చెందిన వివాహిత విజయలక్ష్మి తలకు గాయమై తీవ్ర రక్తస్రావం జరిగిందన్నారు. ఆమె చేతికి కూడా ఫ్యాక్చర్ అయ్యిందన్నారు. గతంలో గుండె ఆపరేషన్ చేయించుకున్న ఆమెను ఎమ్మెల్యే గానీ, అతని అనుచరులు గానీ పరామర్శించకపోవడం దారుణమన్నారు. ప్రమాద స్థలంలో బాధితులు ఉండగానే అధికార పార్టీ నాయకులు ఆ ఫ్లెక్సీని యథాతథంగా అదే ప్రదేశంలో పెట్టారన్నారు. కానీ క్షతగాత్రులను పట్టించుకోవడంలో శ్రద్ధ చూపలేదని ఆరోపించారు. దానికి తోడు ఈ ఘటనపై పోలీసులు కూడా కేసు నమోదు చేయకుండా మౌనముద్ర వహించారన్నారు. ముందుగా క్షతగాత్రులను తన ఆస్పత్రికి తీసుకువచ్చారని, ప్రమాదంలో తల, మెదడుకు తీవ్ర గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స అనంతరం అనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి సిఫారసు చేయాల్సి వచ్చిందన్నారు.

సర్టిఫైడ్ సైకో బాలకృష్ణ

అనపర్తి: ప్రభుత్వం ధ్రువీకరించిన సర్టిఫైడ్ సైకో నందమూరి బాలకృష్ణ మాత్రమేనని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, బాలకృష్ణ ఇంట్లో బెల్లంకొండ సురేష్‌పై కాల్పులు జరిగాయన్నారు. ఆ ఘటనలో మానసిక వ్యాధిగ్రస్తుడిగా సర్టిఫికెట్ తెచ్చుకుని బతుకు జీవుడా అని కేసు నుంచి బయటపడిన సైకో బాలకృష్ణ అని ఎద్దేవా చేశారు. ఆ రోజు డాక్టర్ రాజశేఖరరెడ్డి రాజకీయం చేసి ఉంటే ఈ సైకో జైల్లో ఉండేవారన్నారు. పవిత్రమైన అసెంబ్లీలో అభ్యంతరకర, అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్న బాలకృష్ణ తీరు సరికాదన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆరుగురి ఎంపిక



వై.సతీష్



జి.మురళి



జె.గోపీచంద్



ఎస్.హర్ష



కె.శశికుమార్

అనపర్తి: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు అనపర్తి శివారు కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ జూనియర్ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు అర్హత సాధించారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ మరపడ్ల రాజు గురువారం విలేకరులకు తెలిపారు. కాకినాడలో బుధవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికల్లో జె.గోపీచంద్, జి.మురళి (ఖోఖో), పి.హరీష్ (లాంగ్ జంప్), ఎస్.హర్ష (ట్రిపుల్ జంప్), వై.సతీష్ (హ్యాండ్ బాల్), కె.శశికుమార్ (డిస్కస్ త్రో) ప్రతిభ చూపారన్నారు. ఆ విద్యార్థులను, వారికి శిక్షణ నిచ్చిన వ్యాయామోపాధ్యాయులను ఆయన అభినందించారు.



పి.హరీష్

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..



పందలపాకలో బతుకమ్మ గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

బిక్కవోలు: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పందలపాకలోని వెలంపేట రామాలయం వద్ద గురువారం స్థానిక మహిళలు ఈ కార్యక్రమం జరిపారు. దేవీ నవరాత్రుల సందర్భంగా ఆలయంలో శ్రీదేవి అమ్మవారిని కాత్యాయనీదేవిగా అలంకరించారు. ఈ నేపథ్యంలో మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చారు. అనంతరం పాటలు పాడుతూ గ్రామోత్సవం జరిపారు. గ్రామంలో తొలిసారిగా నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అనపర్తి: తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా భావించే బతుకమ్మ పండగను గురువారం అనపర్తిలో ఘనంగా నిర్వహించారు. ఓం శక్తి సత్సంగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు, భవానీ మాలధారులు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ రకాల పూలతో చేసిన బతుకమ్మల చుట్టూ పాటలు పాడుతూ నృత్యం చేశారు. గౌరీమాతలను శిరసున ధరించి, అనపర్తి వీరులమ్మ ఆలయం నుంచి వినాయకుని ఆలయం వరకూ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను గోదావరి కాలువ జలాల్లో విడిచిపెట్టారు.



అనపర్తిలో బతుకమ్మలతో గ్రామోత్సవం చేస్తున్న ఓం శక్తి సత్సంగం సభ్యులు

వైద్యరంగంలో ఫార్మసిస్టులకు ప్రాధాన్యం



జీజీయూలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

రాజానగరం: వైద్యరంగంలో ఫార్మసిస్టులకు ప్రాధాన్యం పెరిగిందని, ఇది ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యరంగానికి వెన్నెముకగా నిలుస్తుందని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిబిరంలో 141 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ డాక్టర్ ఎండీ ధనరాజ్, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా, డాక్టర్ ఎన్.గాయత్రి, డాక్టర్ ఏఆర్ మగేష్, డాక్టర్ వీడీ సుందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- దివాన్ చెరువులోని విజేస్ ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవంతో పాటు ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ ఎస్.శకుంతల, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్‌వీవీ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర, డీన్ డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ ఎం.లక్ష్మీ ప్రసన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు సరికాదు

కోరుకొండ: అసెంబ్లీ సమావేశాల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు దారుణమని వైఎస్సార్ సీపీ కోరుకొండ మండల కన్వీనర్ అడపా కనకరాజు అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ చట్ట సభలో ప్రజాప్రతినిధిగా కాకుండా సైకోలా బాలకృష్ణ వ్యవహరించారన్నారు. ప్రజా సమస్యలపై చర్చించి, పరిష్కార చర్యలు చేపట్టాల్సిన ఎమ్మెల్యేలు అనవసరమైన చర్చ చేస్తున్నారన్నారు. రైతాంగానికి యూరియా అందించడం, నిత్యావసరాల ధరల తగ్గింపు, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు అందని ద్రాక్షగా మారిందన్నారు.



అడపా కనకరాజు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

రంగంపేట: రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తూర్పు ప్రాంత విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్ ఆవరణలో గురువారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల ససమస్యలపై తాము ఇస్తున్న ఉత్తర్వులను కొందరు పాటించడంలేదని, దీనిని తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. తమ న్యాయస్థానం పరిధిలోని 11 జిల్లాలకు ఒక్క కాకినాడ మాత్రమే బాగా స్పందిస్తోందన్నారు. న్యాయస్థానం సాంకేతిక సభ్యులు ఎస్.రాజబాబు, ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ మాట్లాడారు. కాగా.. సదస్సులో 53 ఫిర్యాదులను ప్రజలు అందజేశారు. వీటిలో ప్రధానంగా జలకళ గొట్టపు బావులు, సాధారణ కొత్త బావులకు విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వడంలో జరుగుతున్న జాప్యానికి సంబంధించనవి ఉండడం గమనార్హం. జలకళకు సంబంధించి రంగంపేట మండలంలో 30 గొట్టపు బావుల సమస్యను తాము పరిష్కరిస్తున్నామని, ఇందులో తక్షణమే 8 గొట్టపు బావుల సమస్య నెల రోజులలో పరిష్కారమవుతుందని అధ్యక్షుడు సత్యనారాయణ ప్రకటించారు. కొత్త కనెక్షన్లకు సంబంధించి ఏప్రిల్ వరకూ డీడీలు కట్టిన వారికి ఇచ్చామన్నారు. మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలానికి వ్యవసాయ కనెక్షన్ల విషయంలో ప్రాధాన్యం ఇవ్వాలని మర్రిపూడి రైతు పుట్టా సోమన్న చౌదరి విజ్ఞప్తి చేశారు. మండలంలోని విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని ఈఈ నటరాజన్, ఏఈ శిరీష తదితరులు హామీ ఇచ్చారు.



రైతు నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



ఉండేశ్వరపురంలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది



పెదపూడిలో మహిళలతో మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సూర్యకుమారి

పెదపూడి: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జుత్తుగ సూర్యకుమారి అన్నారు. పెదపూడిలో గురువారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మార్కెట్ సెంటర్‌లో శుభ్రం చేశారు. గ్రామ సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, కాకినాడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ రావాడ నాగు, పీఏసీఎస్ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ప్రతినిధి ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, ఇన్‌చార్జి ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణరెడ్డి, సచివాలయం కార్యదర్శి జి.ఉషారాణి పాల్గొన్నారు.

సీతానగరం: మండల గ్రామాల్లో సామూహిక శ్రమదానం నిర్వహించామని ఇన్‌చార్జి ఎంపీడీఓ కేవీఎస్ఎస్ మూర్తి తెలిపారు. ఉండేశ్వరపురంలో జరిగిన కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. గ్రామంలోని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. రోడ్లు, పబ్లిక్ స్థలాలను శుభ్రం చేశారు.

కాత్యాయనీదేవిగా అమ్మవారు



ఊలపల్లిలో..



వడిశలేరులో..



చంద్రేడులో..

రంగంపేట/బిక్కవోలు: దసరా మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం అమ్మవారు కాత్యాయనీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రముఖ ఆలయాలతో పాటు అమ్మవారి మండపాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

'స్వస్థ్ నారీ' వైద్య శిబిరాలు

పెదపూడి: స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పెదపూడి సచివాలయం -2లో పెద్దాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఎస్.సాయిరామ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఏపీసీఎస్ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, సర్పంచ్ కలవల కష్ణమూర్తి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ప్రతినిధి ఆరుమిల్లి అమ్మన్న చౌదరి పాల్గొన్నారు.

బిక్కవోలు: కాపవరంలో నిర్వహించిన వైద్యశిబిరంలో కొంకుదురు పీహెచ్‌సీ డాక్టర్ జి.విజయలక్ష్మి సేవలు అందించారు. సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: బొబ్బిల్లంకలో నిర్వహించిన శిబిరంలో 126 మంది మహిళలకు డాక్టర్ ఈ.ఏసురాణి వైద్య సేవలు అందించారు. సర్పంచ్ మెల్లిమి రామచంద్రరావు, ఎంపీటీసీ చిన్ని, పోలిన కృష్ణ, పెండ్యాల అవిస్వామి, పెండ్యాల మోహన్‌బాబు పాల్గొన్నారు.

రంగంపేట: ఈలకొలను సచివాలయం వద్ద రంగంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి వైద్య సేవలు అందించారు. సింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దొడ్డిగుంటలో డాక్టర్ సంకీర్తన ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

నిరుద్యోగ యువతకు శిక్షణ

రాజానగరం: దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల యోజన (డీడీయూ– జీకేవై) ద్వారా నిరుద్యోగ యువతకు సాఫ్ట్ సిల్క్ డెవలప్‌మెంట్‌పై మూడు నెలల శిక్షణ ఇస్తున్నామని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి నుంచి డిగ్రీ వరకూ చదువుకుని, 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులన్నారు. ఆసక్తి కలవారు 91541 44355, 80741 04876 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సేవా కార్యక్రమాల విస్తరణకు కృషి



కళ్లజోడు పంపిణీ చేస్తున్న రాజారెడ్డి

పెదపూడి: జి.మామిడాడ, పరిసర గ్రామాల్లో సేవా కార్యక్రమాలను మరింత విస్తరించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని లయన్స్ క్లబ్ అడ్మిన్ మండ రాజారెడ్డి అన్నారు. జి.మామిడాడలో గత నెల 31న నిర్వహించిన మెగా కంటి శిబిరంలో కళ్లజోళ్లు అవసరమైన గుర్తించిన వారికి గురువారం క్లబ్ ప్రతినిధులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజారెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలు గుర్తించి, వారికి అనుగుణంగా సేవలు అందిస్తున్నామన్నారు. మెగా వైద్య శిబిరం నిర్వహణకు సహకరించిన ఫ్యామిలీ హెల్త్ క్లబ్ కార్యవర్గానికి, ఫౌండర్ ద్వారంపూడి దివాకరరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

నేడు అన్నసమారాధన

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం మహాన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు జామి విశ్వేశ్వరరావు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ గ్రామానికి చెందిన సూర్య మోడరన్ రైస్ మిల్లు అధినేత మల్లిడి పెద్దిరెడ్డి, మంగయ్యమ్మ దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అలాగే ఊలపల్లిలోని జి.మామిడాడ రోడ్డులో ఉన్న కనకదుర్గమ్మ ఆలయం వద్ద కూడా అన్నసమారాధన నిర్వహిస్తారన్నారు.

బాబా ఆలయంలో భక్తుల రద్దీ



సాయిబాబా ఆలయంలో భక్తులు

బిక్కవోలు: బలభద్రపురంలోని ఆంధ్రా షిర్డీ సాయిబాబా ఆలయానికి గురువారం భక్తులు భారీగా తరలివచ్చారు. దేవీ నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో మహా చండీయాగం నిర్వహించారు. అలాగే సాయిబాబాకు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

పెదపూడి: ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని హిందుస్థాన్ యూనిలీవర్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్ మునగ అన్నారు. ఆ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం శహపురంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటపై ప్రభుత్వం అందించి రాయితీలు, ఇతర పంటల కంటే వచ్చే అధిక లాభాలను గురించి వివరించారు. రైతు వీరయ్య చౌదరి మాట్లాడుతూ తమ గ్రామంలో బోర్లు 15 అడుగుల లోతులో పడుతున్నాయి కానీ, ఉప్పు నీరు వస్తోందన్నారు. దీనిపై శ్రీనివాస్ సమాధానమిస్తూ కంపెనీవారు బోర్లకు ఆర్టికల్చర్ ద్వారా ఇచ్చే సబ్సిడీ, ఉపాధి హామీపథకంలో ఫామ్‌పాండ్స్ పథకాన్ని వివరించారు. కార్యక్రమంలో కంపెనీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నరేష్, ఫీల్డ్ ఆఫీసర్లు సతీష్, రాంబాబు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

పెదపూడి: జి.మామిడాడ శివారు లక్ష్మీనరసాపురం గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకుడు కె.వెంకట సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో బాబా వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సేవ నిర్వాహకులు కర్రి నాగిరెడ్డి, అరుణశ్రీ మనవళ్లు రిషి సాయి సిద్ధాన్ రెడ్డి, సాయి శ్రీహాస్ రెడ్డి అన్న వితరణ చేశారు.